క్లుప్తంగా

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం



దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లికి చెందిన చర్లపల్లి రవి కుమారుడు నగేష్‌కృష్ణ(12) అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామ సచివాలయం పక్కన ఉన్న దుకాణం వద్ద ఆదివారం నగేష్‌కృష్ణ ఆడుకుంటున్నాడు. ఉదయం 9గంటల సమయం నుంచి నగేష్‌కృష్ణ కనిపించలేదు. దీంతో తల్లిదండ్రులు గ్రామంతో పాటుగా చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించిన నగేష్‌కృష్ణ ఆచూకి లభించలేదు. దీంతో తల్లిదండ్రులు రవి, అంజలి తమ కుమారుడి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికంగానే వేరే చోట వున్నట్లు ఆదివారం రాత్రి గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

దాచేపల్లి : గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందిన విద్యార్థిని మృతిపై కేసు నమోదు చేసినట్లు సీఐ షేక్ బిలాలుద్దీన్ ఆదివారం తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో నివాసం ఉంటూ దాచేపల్లిలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ చదువుకుంటున్న విద్యార్థిని(17) గత నెల 24వ తేదీన ఇంట్లో ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ శనివారం విద్యార్థిని మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెల్లడించారు. ఇంటర్ ఫెయిల్ అవుతాననే భయాందోళనతో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన తెలిపారు.

అకాల వర్షాలకు దెబ్బతిన్న మిర్చి



పిడుగురాళ్ల: పట్టణ, గ్రామాల్లో అకాల వర్షాలకు మిర్చి పంట పూర్తిగా నాశమైంది. దీంతో రెండు రోజుల నుంచి వర్షాలకు తడిసిన మిర్చిని రైతులు కలాల్లో ఆరబోస్తున్నారు. అంతేకాకుండా పాడైపోయిన పంటకు ఏ విధంగా కాపాడాలో రైతులు సాయశక్తులు కష్టపడుతున్నారు.

విద్యార్థులకు గ్లాసులు, ప్లేట్ల పంపిణీ



పిడుగురాళ్ల: నాణ్యమైన విద్యను అందించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కౌన్సిలర్లు కత్తెరపు వాసుదేవరెడ్డి, పసుపులేటి ఆనంద్ అన్నారు. పట్టణంలోని బాబు జగ్జీవన్ రావు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్లాసులు, ప్లేట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే సంకల్పంతో మరింత ముందుకు వెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పవన్ రెడ్డి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అనాథ బాలలకు చేయూత

శావల్యాపురం: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా స్పాన్సర్‌షిప్ కార్యక్రమాన్ని అనాథ బాలలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత ఆదివారం తెలిపారు. శ్రీలత మాట్లాడుతూ అనాథ బాలలు, తల్లిదండ్రులను కోల్పోయిన వారు ప్రాణాంతక వ్యాధి బారిన పడిన వారు, పేదరికంతో పెద్దలను కోల్పోయిన 18 ఏళ్లలోపు వారికి వాత్సల్య పథకం వర్తిస్తుందని చెప్పారు. నెలకు రూ.4వేలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని వెల్లడించారు. దరఖాస్తు చేసుకునే వారు ఆధార్, రైస్‌కార్డు, ఇతర ధ్రువీకరణ పత్రాలతో వినుకొండ పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.

స్త్రీనిధి రుణాలతో ఆర్థిక ప్రగతి సాధించాలి

శావల్యాపురం: స్త్రీనిధి రుణాల ద్వారా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు ఆర్థిక ప్రగతి సాధించాలని స్త్రీనిధి మేనేజర్ రంతు చిన బుల్లెయ్య ఆదివారం తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గంలోని 5,700 మంది సభ్యులకు రూ.20 కోట్ల రుణాలు ఇవ్వా లని లక్ష్యంగా నిర్దేశించుకోగా, 4,435 మందికి రుణాలు మంజూరు చేశామని పేర్కొన్నారు. రికవరీ 98.04 శాతంగా ఉందని వివరించారు. దీర్ఘకాలిక బకాయిలు 0.80 శాతం ఉన్నాయని చెప్పారు. శావల్యాపురం మండలంలో 980 మంది సభ్యులకు రూ.5 కోట్ల మేర రుణాలు మంజూరు చేసి ప్రథమ స్థానంలో నిలిచినట్టు వెల్లడించారు.

శ్రీనగర్‌లో అభివృద్ధి పరుగులు



శ్రీనగర్‌లో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డు

- రూ. 35లక్షలతో సిమెంట్ రోడ్ల ఏర్పాటు
- గ్రామంలో రూ. 20 లక్షలతో పైప్‌లైన్ల పనులకు శ్రీకారం

దాచేపల్లి : అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా శ్రీనగర్ గ్రామం నిలుస్తోంది. నాడు శ్రీనగర్ అభివృద్ధికి దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ నాంది పలికితే నేడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారు. గ్రామంలోని పలు కాలనీవాసులు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న సిమెంట్ రోడ్లను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో చకచక నిర్మించారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చోరవతో గ్రామ సర్పంచ్ కూసం నాగిరెడ్డి పర్యవేక్షణలో రూ. 35లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్లను నిర్మించారు. మరో రూ. 20లక్షల రూపాయల వ్యయంతో గ్రామంలో పైపులైన్ల పనులకు శ్రీకారం చుట్టారు.

నాడు వైఎస్సార్...నేడు సీఎం జగన్...

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయంలో శ్రీనగర్‌లో అభివృద్ధి జరిగింది. ప్రజా పథం కార్యక్రమంలో సీఎం హోదాలో వైఎస్సార్ పాల్గొన్నారు. రూ.1.50 కోట్లతో తాగునీటి పథకానికి మంజూరు చేసి నిర్మించారు. మరో కోటి రూపాయలతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించారు. శ్రీనగర్, రామాపురం, శ్రీనివాసపురం, గామాలపాడు గ్రామాల పరిధిలోని పోలాలకు సాగునీరు అందించే దండివాగు ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెచ్చారు. దీంతో ఈ ప్రాంతంలో పంటలకు పుష్కలంగా సాగునీరు అందడం వల్ల పంటల్లో అధిక దిగుబడులు రైతులు సాధిస్తున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం ద్వారా 24గంటల కరెంట్‌ను అందిస్తున్నారు. తాగునీటి పథకం ఏర్పాటు చేయటం వలన శ్రీనగర్‌తో పాటుగా గామాలపాడు, దాచేపల్లి, నడికుడి, రామాపురం గ్రామాలకు సురక్షితమైన తాగునీటిని అందిస్తున్నారు. రూ.5 లక్షలతో సుద్దగుంట చెరువును అభివృద్ధి చేశారు. తాగునీటి కోసం పలు చోట్ల బోర్లు వేయించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా రూ.8కోట్ల మేర ప్రజలకు లబ్ధి జరిగింది. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల గ్రామస్తులు ప్రభుత్వంకు కృతజ్ఞతలు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనపై హర్షం...



వైఎస్సార్, జగనన్న హయంలో మా గ్రామంలో అభివృద్ధి బాగా జరిగింది. తండ్రి, కొడుకులిద్దరూ పుణ్యంతో మా గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి జరిగింది. గ్రామంలో మిగిలిన పనులను ప్రస్తుతం చేస్తున్నాం. ఒక వైపు సంక్షేమ పథకాలతో ప్రజలకు అండగా ఉంటునే అభివృద్ధిని కూడా చేస్తున్నాం. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో మా గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

– కూసం నాగిరెడ్డి.
సర్పంచ్. శ్రీనగర్

విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయం

ఎంపీపీ దాసరి

రెంటచింతల: గురజాల సహాయక సాంఘీక సంక్షేమ అధికారి పరిధిలో ఉన్న పలు సంక్షేమ బాల,బాలికల వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న 10వ తరగతి విద్యార్థుల విద్యాభివృద్ధికి డి.హరి సుబ్రమణ్యం రెడ్డి, పి.నీలంరాజు కృషి చేయడం అభినందనీయమని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన రెంటచింతలలోని ఎస్సీ, బీసీ బాల, బాలికల సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లను, చేతి గడియారాలను అందచేసి మాట్లాడారు. విద్యతోపాటు మంచి ప్రవర్తన కలిగి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఒక ప్రణాళికాబద్ధకంగా ఇష్టపడి చదవి ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వారు కోరారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవోలు బేగ్, అరుణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి పరీక్ష సమగ్రిని అందచేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

శవపేటిక బహూకరణ



దుర్గి: పల్నాటి ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న శ్రీ రామకష్ణ సేవా సమితి మరో గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించి తమ దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు. మండలం పరిధిలోని ఆత్మకూరు గ్రామ ప్రజలకు శ్రీ రామకష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి మార్చురీ బాక్స్ (శవపేటిక)ను ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి మాట్లాడుతూ గ్రామానికి చెందిన నిరుపేదలు చనిపోయినప్పుడు ఆర్థికస్తోమత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని కళ్ళారా చూశామన్నారు. చనిపోయిన వ్యక్తికి గౌరవంగా అంత్యక్రియలు జరపాల్సిన బాధ్యత మనందరిపై ఉందఅన్నారు. సుమారుగా లక్ష రూపాయలు వ్యయం చేసి గ్రామస్తులకు మార్చురి బాక్సును అందజేయడంపై శ్రీ రామకష్ణ సేవాసమితి అధ్యక్షుడు సభ్యులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శాంతి రెడ్డి, చిన్నపరెడ్డి ,చెన్నకేశవరెడ్డి, పాపిరెడ్డి, శ్రీనివాస్ ,నరసింహారావు పాల్గొన్నారు.

ఆసరా పథకం మూడో విడత చెక్కుల పంపిణీ

మాచర్ల: వైఎస్సార్ ఆసరా పథకానికి సంబంధించి ఈ నెల మంగళవారం వెల్దుర్తి, రెంటచింతలలో బుధవారం, మాచర్ల రూరల్, పట్టణంలో జరిగే మూడో విడత చెక్కుల విడుదల కార్యక్రమం షెడ్యూలును విజయవంతం చేయాలని ఆయా మండల, పట్టణ అధికారులు కోరారు. మంగళవారం ఉదయం 10గం''లకు వెల్దుర్తిలో, మధ్యాహ్నం రెంటచింతలలో వైఎస్సార్ ఆసరా పథకం జరుగుతుందని ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొని చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అదే విధంగా బుధవారం మాచర్ల రూరల్ మండలంలో ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పీఆర్కే పాల్గొని డ్వాక్రా మహిళలను ఉద్దేశించి చెక్కులను పంపిణీ చేస్తారన్నారు. అనంతరం మధ్యాహ్నం 2గం''లకు మున్సిపల్ కార్యాలయం వద్ద మానుకొండ కల్యాణమండపంలో జరిగే కార్యక్రమంలో పాల్గొని డ్వాక్రా మహిళలకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి వారి నుద్దేశించి మాట్లాడతారని మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణబాబు తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయా మండల స్థాయి అధికారులు కోరారు.

ఘనంగా మట్టల ఆదివారం

గురజాల : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు మట్టల ఆదివారంను ఘనంగా నిర్వహించారు. చర్చిల్లోని దైవ సేవకులు, చిన్నారులు మట్టలు చేతబూని దేవున్ని స్తుతిస్తూ ర్యాలీ నిర్వహించారు. సండే స్కూల్‌లోని చిన్నారులు ఈ వేడుకల్లో పాల్గొని దేవుని బోధనలు విన్నారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ర్యాలీలో చిన్నారులు ఎంతో ఆసక్తిగా పాల్గొన్నారు.

దాచేపల్లి : ప్రభువైన ఏసుక్రీస్తును ఆరాధించడం ద్వారానే పరలోకరాజ్యం ప్రాప్తిస్తుందని ఫాదర్ యామర్తి సురేష్ అన్నారు. మండల వ్యాప్తంగా మట్టలాదివారంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సండేస్కూల్ చిన్నారులు మట్టలతో పురవీధుల్లో ప్రదర్శనగా తిరిగారు. యూదులరాజుకు జై...రాజాధిరాజు ఏసుక్రీస్తుకు జై అంటూ చిన్నారులు నినాదాలు చేశారు. నారాయణపురం ఫాతిమామాత దేవాలయంలో జరిగిన ప్రార్థనలో ఫాదర్ సురేష్ మాట్లాడుతూ సర్వమానవళిని పాపముల నుంచి రక్షించేందుకు ఏసుక్రీస్తు మరియమ్మ తల్లి గర్భమున పవిత్రుడిగా జన్మించాడని, ప్రజలందరూ చేసిన పాపలను బట్టి ఏసుక్రీస్తు సిలువ మరణం పొందారని చెప్పారు. కార్యక్రమాల్లో పాస్టర్లు కాటుపల్లి డేవిడ్ రాజు, కొమ్ము మేరి, లాజర్ పాల్గొన్నారు.

విజయపురిసౌత్: మట్టల ఆదివారం వేడుకలు విజయపురిసౌత్‌లోని చర్చిల్లో ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయాన్నే భక్తులు, చిన్నారులు స్నానాలు ఆచరించి, ఈత మట్టలను వివిధ రకాల పూలతో అలంకరించి చర్చిలకు చేరుకున్నారు. స్థానిక సాగర్‌మాత ఆలయంలో భక్తులు ఈతమట్టలను చేతబూని ఆలయం చుట్టూ తిరుగుతూ దేవునికి స్తుతులు, స్తోత్రాలు అర్పించారు. అనంతరం తేరు ప్రదక్షణ చేశారు. ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాల సాగర్ మట్టల ఆదివారం ఏసుక్రీస్తు మరణం యొక్క ప్రాముఖ్యతను గూర్చి తిరిగి మూడవ రోజు దేవాది దేవుడు పునరుద్దానుడగుటను గూర్చి భక్తులకు బోధించారు. అనంతరం భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. అలానే స్థానిక లూథరన్ చర్చి నుంచి చిన్నారులు ఈత మట్టలను చేబూని గ్రామంలోని పురవీధులలో ఏసుక్రీస్తు నామమును జపిస్తూ భక్తి గీతాలు ఆలపిస్తూ తిరిగారు.



మట్టల పండుగ సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

సాగర్‌మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన నందికొట్కూరు ఎమ్మెల్యే

మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని కర్నూల్ జిల్లా నందికొట్కూరు ఎమ్మెల్యే టి ఆర్థర్ సాగర్‌మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్ ఎమ్మెల్యే ఆర్థర్‌కు ఆశీస్సులు అందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువ, పూలదండలతో ఘనంగా సత్కరించారు.

మాచర్ల: పట్టణంలోని ఆయా చర్చిల్లో ఘనంగా మట్టల పండుగను నిర్వహించి ర్యాలీ జరిపారు. ఆదివారం పట్టణంలోని 70 చర్చిల్లో ఆయా చర్చి పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేసిన క్రైస్తవులు మట్టల పండుగ సందర్భంగా క్రీస్తును స్తుతిస్తూ పట్టణంలో పలు చర్చీల నుంచి ర్యాలీలు జరిపి ప్రత్యేకంగా ప్రార్ధనలు చేశారు. పట్టణంలోని లూథరన్ చర్చిలో పశ్చిమ సినడ్ బిషప్ చాట్ల అంజయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం లూథరన్ చర్చి నుంచి బస్టాండ్ సెంటర్ వరకు మట్టలతో ర్యాలీ జరిపారు. మట్టల పండుగ సందర్భంగా తెలుగు బాప్టిస్టు చర్చి సంఘ కాపరి రెవ. డా'' జె. స్వర్ణన్ కుమార్, కౌన్సిలర్ మాచర్ల సుందరరావు, సొసైటీ కాలనీలో క్రిస్మస్‌కు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ది లెమెన్ ఇవాంజలికల్ చర్చి, కెసిపికి వెళ్ళే రహదారిలోని ఆర్‌సిఎం చర్చిలో ఫాదర్ కొమ్మారెడ్డి రాయపరెడ్డి, 20వ వార్డులోని బేతేలు మందిరంలో జాన్ వెస్లి, సాగర్ రోడ్డులోని ది లెమెన్స్ చర్చి, పెంతుకొస్తు, 23వ వార్డులో పాస్టర్ ఎలీషా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని పలు చర్చిల్లో ఆయా ఫాదర్ల ఆధ్వర్యంలో ప్రార్థనలు ఘనంగా జరిపారు. కేక్‌లు కట్ చేసి క్రీస్తును కీర్తిస్తూ, ప్రత్యేక ప్రార్థనలతో పాటు ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచే వేలాది మంది క్రైస్తవులు ఆయా చర్చిలకు తరలివచ్చి మట్టల పండుగ జరిపారు.



మట్టలతో ప్రదర్శనగా వస్తున్న చిన్నారులు



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో తపస్సుకాలంను పురస్కరించుకుని మట్టల ఆదివారంను క్రైస్తవ సహోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక కానుకమాత చర్చిలో విచారణ గురువులు రె''ఫాదర్ ఏరువ ఊర్ధ్వమరెడ్డి, సహాయ గురువులు పి.స్లీవారెడ్డి ప్రత్యేక దివ్యపూజాబలిని సమర్పించి మాట్లాడారు. యేసుక్రీస్తు జీవితంలోని చివరి ఘట్టాలను (తపస్సుకాల శ్రమలను) కథోలికులందరూ ఈ మట్టల ఆదివారంను పవిత్రాదివారంగా భావించి సంపూర్ణ భక్తి విశ్వాసంతో ప్రార్థించాలన్నారు. ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చిలో పాస్టర్ కటికల ఏసుదానం, భక్తులకు మట్టల ఆదివారం ప్రత్యేకతను వివరించారు. తుమ్మకోట ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చిలో దేగల యోహాన్ మాజీ బిషప్ తూర్పు సినడు ఆధ్వర్యంలో, పాలువాయి, మంచికల్లు, పశర్లపాడు, రెంటాల, జెట్టిపాలెం తదితర గ్రామాలలోని ప్రార్థన మందిరాలలో క్రైస్తవులు ప్రత్యేక పార్థనలు చేసి మట్టల ప్రత్యేకతను వివరించారు. ఆశీర్వాదించిన తాటి, ఈత మట్టలను భక్తులకు పంపిణీ చేశారు. మట్టలను తీసుకున్న భక్తులు క్రైస్తవ భక్తిగీతాలను అలపించారు.

అటవీశాఖ సిబ్బందికి వైద్యపరీక్షలు

నరసరావుపేట రూరల్: అటవీశాఖ సిబ్బందికి కోటప్పకొండలోని ప్రకృతి పర్యాటక కేంద్రంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.రామచంద్రరావు, అటవీ రేంజ్ అధికారి సయ్యద్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో వైద్యులు అటవీ సిబ్బందికి పరీక్షలు చేశారు.మందులు అందించారు. జిల్లాలోని అటవీశాఖ కార్యాలయ సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బందికి వైద్యులు పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖఅధికారిఎస్.రామచంద్రరావు మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అటవీశాఖ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



మాచర్ల నుంచి నర్సరావుపేటకు ఎక్స్‌ప్రెస్ సర్వీస్

కారెంపూడి: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సూచన మేరకు మాచర్ల నుంచి పల్నాడు జిల్లా కేంద్రం నర్సరావుపేటకు మాచర్ల డిపో శనివారం నుంచి ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ను ప్రారంభించింది. మాచర్ల నుంచి వయా దుర్గి, కారెంపూడి, నకరికల్లు మీదగా నర్సరావుపేటకు ఈ సర్వీసు నడుస్తోంది. ఈ సర్వీస్ వల్ల నర్సరావుపేటకు నేరుగా వెళ్లే ప్రయాణికులకు సమయం కలిసి వస్తోంది. మాచర్ల నుంచి ఉదయం 6 గంటలకు, 11 గంటలకు సాయంత్రం 4 గంటలకు ఎక్స్‌ప్రెస్ బయలుదేరుతుంది. అలాగే నర్సరావుపేట నుంచి ఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటలకు, సాయంత్రం 6.30 గంటలకు బస్ బయలుదేరుతుంది. ఇప్పటి వరకు ఆర్డినరీ బస్సులు తప్ప ఎక్స్‌ప్రెస్ సౌకర్యం లేదు. ఇప్పుడు తొలిసారి మాచర్ల నియోజకవర్గ ప్రజలు జిల్లా కేంద్రానికి వేగంగా చేరుకొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. బస్ ఏర్పాట్లు పట్ల ప్రజలు ప్రభుత్వ విప్ పీఆర్కేకు ధన్యవాదాలు తెలుపుతున్నారు.



ఏర్పాటు చేసిన ఎక్స్‌ప్రెస్ సర్వీస్

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం

దాచేపల్లి : హైస్కూల్ అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో సూమారుగా రూ.25 లక్షల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. హైస్కూల్‌లో 1986–87 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.1.08.687 విరాళంను కమిటీ సభ్యులకు అందించారు. మరో 10 రోజుల్లో పనులు పూర్తి అయ్యే అవకాశాలు ఉండడంతో ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటుపై మాట్లాడారు. హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు అభివృద్ధిలో భాగస్వాములు కావడం చరిత్రాత్మకమని, రానున్న కాలంలో మనమంతా కలిసికట్టుగా ఉందని విజయ్‌కుమార్‌రెడ్డి కోరారు. త్వరలో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని హట్టహాసంగా చేద్దామని, ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని నగర పంచాయతీ మాజీ చైర్మన్ మునగా పున్నారావు అన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు కొత్త మధు, గడిపూడి సాంబశివరావు, తంగెళ్ల శ్రీనివాసరావు, షేక్ జాకీర్‌హుస్సేన్, అక్కినపల్లి బాలయ్య, జక్కుల వీరాస్వామి, షేక్ మస్తాన్‌వలి, షేక్ పెదలాల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్‌రెడ్డి

అయ్యప్ప స్వామికి మహా సంప్రోక్షణ

కారెంపూడి: అయ్యప్పస్వామి భక్తులు నూతనంగా చేయించిన అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహానికి స్థానిక సూరేశ్వరాలయంలో రుత్వికులు ఆదివారం మహా సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. హోమాలు నిర్వహించారు. అగ్ని సంస్కారంతో పాటు వివిధ ద్రవ్యాలచే స్వామి వారికి స్నపన చేశారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు గురుస్వాములు పాల్గొన్నారు. ఐదో తేదీన స్వామి వారికి ప్రత్యేక పూజ నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు. సంప్రోక్షణ అనంతరం విగ్రహాన్ని సూరేశ్వరాలయంలో మల్లిఖార్జునస్వామి చెంత ఉంచారు.



అయ్యప్పస్వామి విగ్రహం

అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు

మాచర్ల: పట్టణంలోని సొసైటీ కాలనీలో వేంచేసియున్న శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి దేవాలయంలో బుధవారం అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, గురుస్వామి గణపతి, పందిరి బాల గురవయ్యలు ఆదివారం తెలిపారు. బుధవారం 7గం''లకు పూజా కార్యక్రమాలు నిర్వహించి, స్వామి వారికి అభిషేకాలు జరిపి ఆయన జన్మదినం సందర్భంగా మెట్ల పూజ నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని జరుపుతామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు హాజరై పూజలు నిర్వహిస్తారన్నారు. భక్తులంతా స్వామి జన్మదిన వేడుకలు జయప్రదం చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కారెంపూడి: పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కారెంపూడిలో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో సోమవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని ఎంఈఓ వేముల నాగయ్య ఆదివారం సాయంత్రం తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్, బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్, సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూళ్లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో 14 పాఠశాలలకు చెందిన మొత్తం 708 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వారిలో బాలురు 394 మంది, బాలికలు 314 మంది ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 557 మంది, ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులు 151 మంది ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ

రెంటచింతల: ప్రతి 10వ తరగతి విద్యార్థి ఈ నెల 3 నుంచి జరుగుతున్న పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఎస్ఐ సయ్యద్ సమీర్‌భాష, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఏపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఫ్రెడ్స్‌ఇన్‌నీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 70 మంది 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులతో కలిగిన కిట్లను వారు విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. ఉజ్వల భవిష్యత్‌కు 10వ తరగతి ఎంతో కీలకమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలను ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో దుర్గి మార్కెట్ యార్డు డైరెక్టర్ వెన్నా వెంకటేశ్వరరెడ్డి, స్కూల్ ప్రిన్సిపల్ మోహన్, ఫౌండేషన్ అధ్యక్షుడు పేరం చెన్నారెడ్డి, సభ్యులు డి. మణికంఠారెడ్డి, టి. మనోహర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థికి కిట్లను పంపిణీ చేస్తున్న ఎస్ఐ సయ్యద్ సమీర్‌భాష, భాస్కర్‌రెడ్డి

దాచేపల్లి : పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ అనంతవరపు శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. దాచేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు కేంద్రాలు, స్థానిక ఏపీ ఆదర్శ పాఠశాల, స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, దాచేపల్లిలో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాల్లో 760 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని ఆయన వెల్లడించారు. పెదగార్లపాడు హైస్కూల్‌లో చదువుకుంటున్న 40 మంది విద్యార్థులు బ్రహ్మణపల్లి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో పరీక్షలు రాస్తారని ఆయన చెప్పారు. ఉదయం 8.30 గంటలకు పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలని ఆయన కోరారు.

వైఎస్సార్ ఆసరాతో మహిళల జీవితాల్లో వెలుగు

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

పిడుగురాళ్ల: వైఎస్సార్ ఆసరా మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతుందని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. పట్టణంలోని 24వ వార్డులో వైఎస్సార్ ఆసరా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అన్ని సంక్షేమ పథకాలు నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతున్నాయన్నారు. అంతేకాకుండా డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణమాఫీ చేస్తున్నారని ఆయన తెలియజేశారు. అక్క చెల్లెమ్మలు భరోసా కల్పించేందుకు వారికి అన్ని విధాలుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకరిస్తున్నారని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఆసరా స్టికర్లను అంటిస్తున్న వలంటీర్, పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

అగ్నిప్రమాదం

నరసరావుపేట టౌన్: షార్ట్ సర్క్యూట్ వల్ల ఇంట్లో గృహోపకరణాలు దగ్ధమైన ఘటన ఆదివారం పట్టణంలో జరిగింది. అగ్నిమాపక శాఖ సిబ్బంది కథనం ప్రకారం.. గుంటూరు రోడ్డులోని సబ్బా రాంబాబు తన గృహంలో టీవీ చూస్తుండగా షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. వెంటనే కుటుంబ సభ్యులు ఇంటి నుంచి బయటకు పరుగులు తీశారు.